క్లుప్తంగా

కృతజ్ఞతాపూర్వక కలయిక



ఎమ్మెల్యే కళావతికి కృతజ్ఞతలు తెలుపుతున్న ప్రేమభూషణరావు

వీరఘట్టం: పాలకొండ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సూచించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శిగా నియమితులైన వీరఘట్టంకు చెందిన కళింగ ప్రేమభూషణరావు శనివారం వండవలో ఎమ్మెల్యే కళావతిని, పాలకొండలో ఎమ్మెల్సీ విక్రాంత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతో పాటు వీరఘట్టంకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు సైల సుహాష్, సైల రంజిత్ ఉన్నారు.

బోగస్ ధ్రువపత్రాలపై విచారణ

సీతంపేట: ఎస్టీ బోగస్ కులధ్రువీకరణ పత్రాలతో ఉద్యోగాలు చేస్తున్న వారిపై వచ్చిన ఫిర్యాదులపై ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి శనివారం విచారణ జరిపారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి ధ్రువపత్రాలను పరిశీలించారు. 3 కేసులకు సంబంధించి మరిన్ని ఆధారాలు తీసుకురావాలని సూచించారు. ఏపీఓ రోసిరెడ్డి, డీడీ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ దేశ్ తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టిలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలి



ఐటీడీఏ వద్ద నిరసన తెలియజేస్తున్న గిరిజనులు

సీతంపేట: మెళియాపుట్టి కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటు చేయాలని స్థానిక ఐటీడీఏ ముఖ ద్వారం వద్ద ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబయోగి ఆధ్వర్యంలో గిరిజనులు శనివారం నిరసన తెలిపారు. జిల్లాల విభజన జరిగి రెండేళ్లయినా శ్రీకాకుళం జిల్లాకు ఐటీడీఏ ఏర్పాటు చేయకపోవడం అన్యాయమన్నారు. ఎస్టీ నియోజకవర్గం కేటాయించాలని, గిరిజన గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు బైలాపురం సింహాచలం, గురడి అప్పన్న, కిరణ్, పి.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంఈఓ

గరుగుబిల్లి: పాఠశాలల్లో నాడు-నేడు రెండో విడత అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంఈఓ ఎస్.నాగభూషణరావు అన్నారు. మండలంలోని కొంకడివరంలో నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ భవనాన్ని శనివారం ఆయన పరిశీలించారు. మండలంలో నాడు-నేడు మొదటి విడతలో 27 పాఠశాలలో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. రెండో విడతలో 31 పాఠశాలలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. నిర్మాణాలకు అవసరమైన సామాగ్రిని కాంట్రాక్టర్లకు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. అంగన్‌వాడీ భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన సభ్యులకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎన్నికల అధికారి శ్రీదేవి

జియ్యమ్మవలస: మండలంలోని రావాడ వట్టిగెడ్డ రిజర్వాయరు పరిధిలో ఉన్న ఇప్పలపల్లి మత్స్యకార సహకార సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం రావాడలో జరిగింది. ఎన్నికల అధికారి శ్రీదేవి ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా వాటక సింహాచలం, కార్యదర్శిగా ఎజ్జు భీమన్నదొర ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు.

భూముల రీసర్వే..



భూముల రీసర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

పాలకొండ రూరల్: పట్టణ పరిధిలో కొనసాగుతున్న సమగ్ర భూసర్వేలో తమ వ్యక్తిగత సమస్యలను పలువురు భూ హక్కుదారులు సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్‌కు దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు రీసర్వే మొబైల్ డీటీ పల్లా సన్యాసిరావు నేతృత్వంలో సర్వే సిబ్బంది శనివారం మరోసారి ఆయా భూములను సర్వే చేశారు. అర్జీదారులు లేవనెత్తిన సమస్యలు పరిష్కరించి వారికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ పి.వెంకటరమణ, వీఆర్వో బలివాడ సాయి శ్రీనివాసరావు, జి.గణేష్ పాల్గొన్నారు.

ముగిసిన సమగ్ర ఓటరు సర్వే

- ఇంటింటికీ వెళ్లి వివరాలు ఆరా తీసిన బీఎల్‌ఓలు
- శత శాతం పరిశీలన పూర్తి
- ప్రారంభమైన పోలింగ్‌స్టేషన్ల క్రమబద్ధీకరణ
- మార్పులు, చేర్పులు, ఓటరు నమోదుకు 12,480 దరఖాస్తులు



పార్వతీపురం మండలం ఎమ్మార్ నగరంలో సమగ్ర ఓటరు సర్వే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ హేమలత

పార్వతీపురం టౌన్: తప్పుల్లేని స్వచ్ఛ ఓటరు జాబితా తయారీకి జిల్లాలో చేపట్టిన ఇంటింటి సర్వే ముగిసింది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు ఓటరు సంక్షిప్త సవరణ – 2024 కార్యక్రమాన్ని జిల్లాలో 35 రోజులు నిర్వహించారు. ఇంటింటి సర్వేలో భాగంగా జూలై 21 నుంచి ఆగస్టు 25 వరకూ బీఎల్‌ఎలు ప్రతి గడపకూ వెళ్లారు. తప్పుల్లేని ఓటరు జాబితా తయారీకి వివరాలు సేకరించారు. కొత్త ఓటర్ల నమోదు, మృతుల ఓట్ల తొలగింపుతో పాటు శాశ్వత వలసదారులను గుర్తించి వారికి సమాచారం ఇచ్చి తొలగింపు ప్రక్రియ చేపట్టారు. మార్పులు, చేర్పులు, నూతన ఓటరు నమోదు ఇలా ప్రతిదానికీ దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలో చేపట్టిన ఇంటింటి సర్వేను ఈఆర్డీఓలు, ఏఈఆర్డీఓలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వచ్చారు.

శత శాతం పరిశీలన పూర్తి

స్వచ్ఛ ఓటరు జాబితా తయారీలో భాగంగా ఇంటింటి సర్వే పక్కాగా చేయాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆదేశించడంతో పాటు ఇదే అంశంపై పలుమార్లు సమీక్షించారు. ఈ క్రమంలో బీఎల్‌ఓలు 35 రోజుల పాటు ఇంటింటికీ తిరిగి శత శాతం కుటుంబాలను సర్వే చేశారు. యువ ఓటర్లు నమోదుకు ఫారం – 6, ఓటర్ల తొలగింపు వివాహమై మరో చోటకు వెళ్లిన వారు అక్కడ ఓటు చేర్చడానికి ఫారం – 7, తప్పులు సవరణకు ఫారం – 8 స్వీకరించారు. అలాగే 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు పూర్తయ్యే వారిని నూతన ఓటర్లుగా గుర్తించి ఫారం – 6 తీసుకున్నారు.

రిటర్నింగ్ అధికారుల పర్యవేక్షణలో..

ఎన్నికల సంఘం ఇప్పటికే నియోజకవర్గాల వారీగా రిటర్నింగ్ అధికారులను (ఆర్డీఓ) నియమించింది. దీంతో వారు ఇంటింటి సర్వే వివరాలను ఎప్పటికప్పుడు బీఎల్‌ఓల నుంచి తెప్పించుకుని పరిశీలించారు. ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి సూచనలు, సలహాలు స్వీకరించారు. ఓటరు జాబితాకు సంబంధించి పూర్తి బాధ్యతలను ఈఆర్డీలకు అప్పగించి పర్యవేక్షించారు.

ప్రారంభమైన పోలింగ్ స్టేషన్ల క్రమబద్ధీకరణ

ఎన్నికల కమిషన్ పోలింగ్ స్టేషన్ క్రమబద్ధీకరణపై కూడా దృష్టి సారించింది. ఇందులో భాగంగా అధికారులు బుధవారం నుంచి సెప్టెంబర్ 29 వరకూ జిల్లాలోని పోలింగ్ స్టేషన్లను పరిశీలించి అన్ని వసతులు సమకూర్చేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ముఖ్యంగా ఎపిక్ కార్డులు, ఎలక్ట్రోరల్ రోల్ నంబర్ల మధ్య వ్యత్యాసాన్ని సరి చేయడం, ఓటర్ల తాజా ఫొటోలను అప్‌లోడ్ చేయడం, పోలింగ్ స్టేషన్ల సరిహద్దులు గుర్తించడం, మౌలిక వసతులైన విద్యుత్, ర్యాంప్ నిర్మాణం తదితరాలను పరిశీలించనున్నారు.

శత శాతం పూర్తి



స్వచ్ఛ ఓటరు జాబితా తయారీలో భాగంగా జిల్లాలో చేపట్టిన ఇంటింటి సర్వే జిల్లాలో శత శాతం పూర్తి చేశాం. ఇందులో భాగంగా అధికారులు బుధవారం నుంచి సెప్టెంబర్ 29 వరకూ జిల్లాలోని పోలింగ్ స్టేషన్లను పరిశీలించి అన్ని వసతులు సమకూర్చేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసుకున్న బూత్ లెవల్ అసిస్టెంట్లు, బీఎల్‌ఓల సమన్వయంతో ఇంటింటి సర్వే విజయవంతం చేశాం.

– నిషాంత్‌కుమార్, కలెక్టర్, పార్వతీపురం మన్యం

జిల్లాలో సమగ్ర సర్వే ఇలా..

నియోజకవర్గం	పోలింగ్‌స్టేషన్ల సంఖ్య	మొత్తం ఓటర్లు	మొత్తం ఇళ్లు	పరిశీలించిన ఇళ్లు	పరిశీలించిన ఓటర్లు
పాలకొండ	283	198347	81414	81414	198347
కురుపాం	268	186610	67998	67998	186610
పార్వతీపురం	233	187815	57618	57618	187815
సాలూరు	240	197817	67296	67296	197817
మొత్తం	1024	770589	274326	274326	770589

కొత్తగా నమోదు ఇలా..

నియోజకవర్గం	ఫారం-6	ఫారం-7	ఫారం-8
పాలకొండ	4406	6602	17442
కురుపాం	4550	2978	18791
పార్వతీపురం	1119	793	8483
సాలూరు	2405	1894	13235
మొత్తం	12480	12267	57951

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

సీతంపేట: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం డీపీఎం షణ్ముఖరాజు అన్నారు. స్థానిక ఎంఎంఎస్‌లో శనివారం సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏటీఎం మోడల్ వ్యవసాయం ఎక్కువ అభివృద్ధి చేయాలన్నారు. వర్షాధార భూముల్లో ఈ తరహా పద్ధతి అనుసరించడం ఎంతో ఉత్తమం అన్నారు. వరిసాగులో కలుపు నివారణపై అవగాహన కల్పించారు. తీగజాతి కూరగాయల పెంపకం చేపట్టాలన్నారు. ఎరువులు, రసాయన మందుల వాడకం తగ్గించాలన్నారు. భూసారం పెంచేందుకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో పీఏఓ హరికృష్ణ, దేవీ ప్రసాద్, తిరుపతి, సింహబలుడు, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగు పద్ధతుల పరిశీలన



గుమ్మలక్ష్మీపురం: పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్న జట్టు కోఆర్డినేటర్ నూకంనాయుడు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని గొరడ, రాయగడ జమ్ము గ్రామాల్లోని రైతులు ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న వివిధ పంటలతో పాటు మాతోట-జీవ ప్రాజెక్ట్‌లో భాగంగా సాగుచేస్తున్న అంతర పంటలను సీతంపేట మండలం నుంచి వచ్చిన 40 మంది రైతులు శనివారం పరిశీలించారు. వెలుగు స్వచ్ఛంద సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజీవరావు ఆధ్వర్యంలో వారంతా ఇక్కడకు వచ్చి ఇక్కడి రైతులు తయారు చేసిన సేంద్రియ ఎరువులు, పంటల సాగును పరిశీలించారు. ఆదాయ వ్యయాలపై ఆరాతీశారు. కార్యక్రమంలో జట్టు కోడైరెక్టర్ ఎం.నూకంనాయుడు, మాతోట జీవ కమిటీ అధ్యక్షుడు తాడంగి జమ్మయ్య, జీవ కోఆర్డినేటర్లు జి.ప్రబోద్, జి.మురళిమోహన్ పాల్గొన్నారు.

29న మండల సమావేశం

కురుపాం: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 29న ఎంపీపీ శెట్టి పద్మావతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వీవీ శివరామప్ప శనివారం తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులతో పాటు మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

పేకాట శిబిరంపై దాడి

వీరఘట్టం: మండలంలోని బిటివాడ శివారు మామిడి తోటలో జరుగుతున్న పేకాట శిబిరంపై ఎస్సై ఎం.వి.రమణ సిబ్బందితో కలిసి శనివారం సాయంత్రం దాడి చేశారు. పేకాట ఆడు తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.18,700 నగదు, ఏడు బైక్‌లు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సెల్‌టవర్ ఏర్పాటుచేస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తాం..



సెల్‌టవర్ ఏర్పాటు కోసం తవ్విన గుంతలను పరిశీలిస్తున్న గిరిజన సంఘ నాయకులు

కురుపాం: గిరిజనులు సాగు చేస్తున్న పంట పొలాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా బీఎస్ఎన్ఎల్ సెల్‌టవర్ నిర్మాణం చేపడితే తీవ్రంగా ప్రతిఘటిస్తామని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మండంగి శ్రీనివాసరావు, గిరిజన రైతులు హెచ్చరించారు. శనివారం వారు మాట్లాడుతూ బియ్యాలవలస పంచాయతీ దురుబిలి గ్రామం పరిధిలో మూలిగూడ జంక్షన్ వద్ద 50 సంవత్సరాలుగా సాగుచేస్తున్న గిరిజన రైతు భూమిలో బీఎస్ఎన్ఎల్ సెల్‌టవర్ నిర్మాణం చేపట్టేందుకు అధికారులు గుంతలు తవ్వారు. ఏజెన్సీలోని ఏదైనా నిర్మాణం చేపట్టాలంటే పీసా చట్టం ప్రకారం గ్రామసభ తీర్మానం, భూమి సాగుచేస్తున్న రైతు ఆమోదం అవసరమని అధికారులకు తెలియదా అన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు నిర్మాణ చర్యలు నిలుపుదల చేయాలని కోరారు.

మానవతామూర్తి మదర్ థెరీసా



సీతంపేట: మదర్ థెరీసా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు, ఉపాధ్యాయులు

వీరఘట్టం: మదర్‌థెరీసా జీవితం నేటి యువతకు ఆదర్శం కావాలని చిట్టపులివలస ఆర్‌సీఎం చర్చ్ ఫాదర్ సతీష్‌కుమార్ అన్నారు. మదర్‌థెరీసా జయంతిని పురస్కరించుకుని చిట్టపులివలసలో శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సేవకు ప్రతిరూపం, నిస్సహాయులకు, నిరుపేదలకు ప్రేమామృతాన్ని పంచిపెట్టిన మానవతామూర్తి మదర్‌థెరీసా అని కొనియాడారు. ఆమె జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. అంతకుముందు గ్రామంలోని థెరీసా విగ్రహం వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విద్యార్థులు, గ్రామస్తులతో కలిసి ర్యాలీ చేశారు.

ఆశ్రమ పాఠశాలలో..

సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మదర్ థెరీసా జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణంలో ఉన్న ఆమె విగ్రహానికి హెచ్‌ఎం ఎ.లిల్లీరాణి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఓ పాలక అమల, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.



వీరఘట్టం: చిట్టపులివలసలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, గ్రామస్తులు

30 నుంచి సీపీఎం సమరభేరి



గుమ్మలక్ష్మీపురం: వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

గుమ్మలక్ష్మీపురం: నిత్యావసర ధరలు, విద్యుత్ చార్జీలు తగ్గించాలని, యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించాలని, తదితర డిమాండ్లతో ఈ నెల 30 నుంచి సెప్టెంబరు 4 వరకు సమరభేరి కార్యక్రమం నిర్వహించనున్నట్లు సీపీఎం నాయకులు కోలక అవినాష్, మండంగి రమణ, మోహనరావు, ఎం.సన్యాసిరావు తెలిపారు. ఈమేరకు స్థానిక గిరిజన సంఘం కార్యాలయం వద్ద శనివారం సమరభేరికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మతోన్మాద మోడీ ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో, ధరలను అదుపు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. గద్దెనెక్కిన మొదలు ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ.. కార్పొరేట్లకు, బడా పెట్టుబడిదారులకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తూ.. పేద ప్రజలపై పన్నుల భారాన్ని మోపుతోందని మండిపడ్డారు. దీన్ని వ్యతిరేకిస్తూ నిర్వహించనున్న సమరభేరి నిర్వహిస్తున్నామని, ఈనెల 30న ప్రచారం, సంతకాల సేకరణ, సెప్టెంబర్ 1న గ్రామ/వార్డు సచివాలయాల్లో ధర్నా, విజ్ఞాపన పత్రాలు సమర్పణ, సెప్టెంబర్ 3న నిరుద్యోగ వ్యతిరేక దినం, 4న మండల కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ప్రజానీకం పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

సీతంపేట: ఈనెల 30 నుంచి వచ్చేనెల 4 వరకు సీపీఎం ఆధ్వర్యంలో సమరభేరి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు తెలిపారు. ఇందులో భాగంగా ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా సంతకాల సేకరణ, సచివాలయాల వద్ద నిరసన, మండల రెవెన్యూ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. సమరభేరికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎ.భాస్కరరావు, జె.శ్రీరాములు, వెంకటరావు, సుందరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కురుపాం: కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను తరిమి కొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కొల్లి గంగునాయుడు, పార్టీ నాయకులు ఎం.శ్రీనివాసరావు, జియ్యమ్మవలస మండల కార్యదర్శి కె.సీతారాం పిలుపునిచ్చారు. మండలంలోని బియ్యాలవలస పంచాయతీ మంత్రజోల గ్రామంలో సమరభేరి పోస్టర్లను విడుదల చేశారు. మోడి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలకు వ్యతిరేకంగా ఆగస్టు 30న నుంచి సెప్టెంబర్ 4 వరకు ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు నిరసనలు చేపట్టనున్నట్లు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



బాధితురాలికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

పాలకొండ: ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కును ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి బాధిత కుటుంబానికి శనివారం అందజేశారు. పట్టణంలో 16వ వార్డు పల్లవీధికి చెందిన కుదిగాన ధనుంజయ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఆ కుటుంబానికి ఆర్థిక సాయం చేయాలని ఎమ్మెల్యే సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కోరగా.. సీఎం సహాయనిధి నుంచి లక్ష రూపాయలు మంజూరు చేశారు. ఆ మొత్తానికి సంబంధించిన చెక్కును మృతుని భార్య మహాలక్ష్మికి ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కడగల రమణ, పార్టీ పట్టణ అధ్యక్షుడు వెలమల మన్మధరావు, కౌన్సిలర్లు బాసూరు కాంతారావు, నీలాపు శ్రీనివాసరావు, కోడెం విజయ్‌కుమార్, పార్టీ నాయకులు టీకు రామకృష్ణ, సత్యనారాయణ, సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకే ఇళ్ల స్థలాలు కేటాయించాలి



వీఎస్ఎస్ అటవీ భూముల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న గిరిజనులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట పంచాయతీ భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ బాయ్స్ కాలేజ్ సమీపంలో ఖాళీగా ఉన్న వనసంరక్షణ సమితి అటవీ భూముల్లో స్థానికులకు నివాస స్థలాలు మంజూరు చేయాలని సీపీఎం, గిరిజన సంఘం నాయకులు కోలక అవినాష్, మండంగి రమణ, సన్యాసిరావు, అగ్గన్న తదితరులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం జే.కే.పాడు, ఎస్.కే.పాడు, ఎల్విన్‌పేట గ్రామాలకు చెందిన పలువురు గిరిజనులు ఖాళీగా ఉన్న వీఎస్ఎస్ అటవీ స్థలం వద్దకు చేరుకొని, అక్కడి తుప్పలు, పొదలను తొలగించారు. ఆ స్థలం ఎల్విన్‌పేట అటవీశాఖ బీట్‌లోని జే.కే.పాడు, ఎస్.కే.పాడు గ్రామాలకు చెందిన వన సంరక్షణ సమితిలకు 1995లోనే ప్రభుత్వం అప్పగించిందని, తామంతా నిరుపేదలేనని, ఆ స్థలంపై పూర్తి హక్కులు స్థానికులైన తమకే ఉందని, సంబంధిత అధికారులు స్పందించి స్థానికులైన తమకే నివాస స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వారికి సీపీఎం నాయకులు మద్దతుగా నిలిచారు.

పకడ్బందీగా ఓటర్ల జాబితా..



సీతంపేట: మాట్లాడుతున్న పీఓ కల్పనాకుమారి

- ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి

సీతంపేట: పకడ్బందీగా ఓటర్ల సర్వే చేస్తున్నామని ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి అన్నారు. వివిధ రాజకీయపార్టీల నాయకులతో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం ఓటరు సర్వే చేస్తున్నామన్నారు. మరణించిన వారి ఓట్లు తొలగించడంతో పాటు కొత్త ఓటరు నమోదు చేస్తున్నామన్నారు. సర్వే వేగవంతం చేయాలని బీఎల్‌ఓలకు సూచించినట్లు చెప్పారు. సర్వేకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ మండలాల తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి వెళ్లి ఓటు పరిశీలించాలి

- సబ్‌కలెక్టర్ నూరల్‌కమాల్

కొమరాడ: బీఎల్‌ఓలు ప్రతీ ఇంటికి వెళ్లి పక్కాగా ఓటరు వెరిఫికేషన్ చేయాలని పాలకొండ సబ్‌కలెక్టర్ నూరల్‌కమల్ అన్నారు. మండల కేంద్రం కొమరాడ, దుగ్గి తదితర గ్రామాల్లో చేపడుతున్న ఇంటింట ఓటరు పరిశీలన కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. సర్వే వివరాలను బీఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. ఓటరు జాబితాలో తప్పులు లేకుండా పక్కాగా రూపొందించడంలో బీఎల్‌ఓలదే కీలక పాత్ర అని, చిత్తశుద్ధితో సర్వే చేయాలని సూచించారు. మృతులు, వలసదారులు, కొత్త ఓటర్ల నమోదు తదితర వివరాలు పక్కాగా ఉండాలన్నారు. ఎన్నికల విధుల నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ రాధకృష్ణమూర్తి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు

గరుగుబిల్లి: మండలంలోని గరుగుబిల్లి, రావివలస తదితర గ్రామాల్లో చేపడుతున్న ఓటర్ల జాబితా పరిశీలన సర్వేను సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్ శనివారం తనిఖీ చేశారు. రెండు శాతం కంటే ఎక్కువ తొలగింపులుంటే నిశితంగా పరిశీలించాలని సహాయ ఓటరు నమోదు అధికారి, బూత్ స్థాయి అధికారులను ఆదేశించారు. డబుల్ ఎంట్రీలు, మృతులు, శాశ్వత వలసదారులు, ఒకే డోర్ నంబరుతో ఉన్న ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. ఓటర్ల తొలగింపులో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట తహసీల్దార్ జీవీ జనార్దన్, డీటీ పీఎస్.లక్ష్మీకుమార్ ఉన్నారు.



కొమరాడలో ఓట్లు వెరిఫికేషన్ చేస్తున్న సబ్‌కలెక్టర్ నూరల్‌కమాల్

ఈ-క్రాప్ నమోదు పక్కాగా చేపట్టాలి

- జేసీ గోవిందరావు



పంటల నమెదును పరిశీలిస్తున్న జేసీ గోవిందరావు

పాలకొండ: ఈ-క్రాప్ ద్వారా పంటల నమోదు సక్రమంగా చేపట్టాలని జేసీ ఆర్.గోవిందరావు సూచించారు. మండలంలోని వెలగవాడ గ్రామంలో వ్యవసాయ శాఖ చేపడుతున్న పంటల నమోదు కార్యక్రమాన్ని శనివారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ, వ్యవసాయశాఖల అధికారులు జాయింట్ అజమాషీతో పంట నమోదు చేయాలన్నారు. రైతులు ఆర్‌బీకే సిబ్బందిని సంప్రదించి ఈ-క్రాప్‌లో వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. పీఎం కిసాన్‌కు సంబంధించి తప్పుగా నమోదు జరిగిన ఆధార్‌లను వెంటనే సరిచేయాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావుకు ఆదేశించారు. ఆయనతో పాటు మండల వ్యవసాయశాఖ అధికారి వై.వాహిని ఉన్నారు.

